నీడ - క్రీనీడ

ధనుర్మాసం రోజులు. మంచు కురుస్తోంది.

చలిలో మునగదీసుకుని పడుకున్నది... ఊరు.

వాక్యంలో కుదురుకున్న భావంలా వెట్టగా కూర్చుంది, ఇల్లు.

ఇంట్లో బుడ్డి దీపం మినుకు మినుకు మంటోంది. మంచంలో పడుకుని ఏదో తనలో తాను గొణుక్కుంటున్నాడు... సాంబయ్య.

పక్కనున్న కరణంగారింట్లో గడియారం పన్నెండు కొట్టింది.

సాంబయ్యకు నిద్రరావడం లేదు, " ఈ రాత్రి కింక నిద్రపట్టదు" లేచి కూర్చున్నాడు. మాసిన గడ్డాన్ని అలవోకగా నిమురుకుని, శాలువాని బుజం నిండుగా లాక్కున్నాడు. జలుబుతో పగిలిన గొంతుని సరిచేసుకున్నాడు.

ఎదురు గోడకేసి చూశాడు. "ప్రాణాలన్నీ అక్కడే ఉన్నై. మరిచిపోతామన్నా మరపురాదు. ఎంత ఘోరం జరిగిపోయింది."

సాంబయ్య మంచం దిగేడు. అడుగులు తడబడినై. కాళ్ళు చలితో బిరుసెక్కి మేధస్సు చేస్తున్న ఆలోచనకు తాళం వేస్తూ వణకసాగినై.

గోడవారగా నడిచి తలుపుదాకా వెళ్ళాడు. ద్వారబంధం పక్కగా వున్న ఫోటోని చేతిలోకి తీసుకొని అక్కడేకూర్చుండి పోయాడు. ఫోటోమీదికి చూపులు నిలిపి, దాన్ని వేళ్లతో నిమురుకున్నాడు. రెండు చేతుల్తోనూ మొహానికి దగ్గరగా తెచ్చుకొని... పెదవులతో ముద్దుపెట్టుకున్నాడు.

"నా బంగారు తల్లి" సాంబయ్య కంఠం రుద్ధమైంది. తడిబట్టని పిండినట్లు బాధ... గుండెను పిండేయసాగింది. కూర్చున్నవాడికి కూర్చున్నట్టే ఏడుపు

ముంచుకొచ్చింది. ఫోటోని పక్కనే ఉన్న ఉయ్యాల బల్లమీద ఉంచి, వెక్కి వెక్కి ఏడవసాగేడు.

***

సాంబయ్య తాతగారు బ్రహ్మీభూతుడు.

సాంబయ్య తండ్రి యజ్ఞం చేశాడు. ఆయన దేవీ ఉపాసకుడు. దేహీ అని ఒకర్ని యాచించకుండా నిత్యాన్నదానంతో, నిత్యాగ్నిహోత్రంతో ఇంటినీ వంటినీ పునీతం చేసుకున్న మహర్షిగా చెప్పుకుంటారు... ఆయన్ని తెలిసినవాళ్ళు. ఆ బ్రహ్మ తేజస్సు అలాంటిది! ఇంట్లోనే వేదపాఠశాల. చుట్టూ అంతేవాసులూ, ఇతర ఒజ్జలూ. ఆ ప్రాంతమంతా ఒక గురుకులం. ఆయన కర్మిష్ఠి; వేదాంతి, గురువు, శాస్త్రి, పెద్ద, అయ్యవారు...అంతే!

ఊరు మనుగడకే ఆయన ఏడుగడగా గడిచిన రోజులు అవి.

సాంబయ్య నూనూగు మీసాల రోజులలోనే కాంతమ్మతో వివాహం జరిగింది. అప్పటికి ఆమె... "అష్టవర్షాత్‌భవేత్ కన్యా."

తండ్రిచాటు బిడ్డగా ఉంటూనే సాంబయ్య ఆరోజుల్లో నాలుగెకరాల పొలానికి సరిపడా డబ్బును... నేతి డబ్బాల్లోంచీ, బియ్యపు బస్తాల్లోంచీ... రొల్లుకున్నాడు. అతని మేనమామ సాంబయ్యకు ఈ వ్యవహారాల్లో వత్తాసు.

తండ్రి తనువు చాలించగానే... తాను దాక్షీకం వెలగబెట్టడం మొదలెట్టాడు సాంబయ్య. నోట్లో ఉన్న నాలుగు ముక్కలూ వైదీకానికి అక్కరకొచ్చినై. లౌక్యం తెలిసిన పిండం కనుక, దృష్టి రూపాయి కాసులమీదనే నిలిపి రోజుల్ని పరుగెత్తించడం నేర్చుకున్నాడు.

అతనికంటే మించిన లాఘవం కాంతంకి ఉంది. రూపాయిని చేతులు మార్చి చూస్తుండగానే రెండు చేసే చాకచక్యం... ఆమె విద్య.

పదహారో ఏటనే కాంతం కడుపుపండి రాజ్యం పుట్టింది. ఆ పిల్లకు పెళ్లయిన తరువాతగాని, ఆ ఇంట మరో ఉయ్యాల పడలేదు.

కాంతంకి ముప్పైరెండవ ఏట సుమతి పుట్టింది.

అప్పటికెప్పుడో గురుకులం రూపు మాసి పోయింది. పెద్దల ఆదర్శాలు, ఆశయాలు వాళ్లతోనే పోయాయి.

సాంబయ్య పదెకరాల మాగాణీ, ఆరెకరాల మెరకతో స్థితిపరుడిగా స్థిరపడ్డాడు. ఊరంతకీ ఆయన పురోహితుడు, పౌరాణికుడు.

***

సాంబయ్య మెల్లగా కళ్లు పైకెత్తాడు.

ఎవరో నోటిముందటి ముద్ద లాక్కున్నట్లు ఉలిక్కిపడ్డాడు.

క్షణం తరువాత నిమ్మళంగా లేచి పక్క గదిలోకి వెళ్ళాడు. కావడి పెట్టి తెరిచాడు. దానిలోనుంచీ గుడ్డ సంచిని తెచ్చుకొని మంచం పక్కగా నేలమీద కూర్చున్నాడు.

సంచిముడి ఊడదీసి నేలమీదికి తలక్రిందుగా కుమ్మరించాడు.

డబ్బు!! అప్పుడే విడుదల పొందిన ఖైదీల్లా- నోట్లు, చిల్లర - చెల్లాచెదురుగా పడినై.

వాటన్నిటినీ ఒక్కటొక్కటే తీసి లెక్కపెట్టసాగేడు సాంబయ్య.

లెక్క పూర్తి చేసేసరికి మెరుపు తీగని అంటుకున్నట్లయింది.

"ఐదు వేలా ఇన్నూటా అరవై ఆ(రూపాయలైందన్నమాట ఖర్చు" అని పైకే అనుకున్నాడు

డబ్బంతా సంచిలో ఉంచి మళ్ళీ బొందుతో మూతి ముడివేసేశాడు. తీసుకువెళ్లి కావడి పెట్టెలో పెట్టొచ్చి మంచంమీద కూర్చున్నాడు.

"దొంగముండా, దొంగముండాకొడుకూ... నా కొంప గుణ్ణం చేశారు."

సాంబయ్య ముక్కుపుటాలు అదిరినై, పెదవులు వణికినై.

ఉన్నట్టుండి రబ్బరు బంతిలా పైకి లేచాడు. మంచంకింది పొన్ను కర్ర తీసుకొని మంచంమీద బాదసాగేడు. "చావండి...చావండి... మీ రోగం ఇట్లాగే కుదురాలి...ఆఁ... ఏడవండి... బాగా కుయ్యో, మొఱ్ఱోమని, లబో దిబోమని మొత్తుకు చావండి." అంటూ శక్తి సన్నగిల్లేదాక కొట్టేడు.

ఆపైన కర్రని అవతలికి విసిరేసి దొడ్డి తలుపు తెరుచుకుని పెరట్లోకి వెళ్లాడు.

నూతి పళ్లెం పక్కగా బంతి చెట్ల వరుస ఉంది. ఆ చెట్లకు విరగకాసిన పూలన్నీ పుటుకు పుటుకున కోసుకుని శాలువా కొంగున కట్టుకుని లోపలికొచ్చాడు.

హాల్లో ఉయ్యాల బల్లమీద కూర్చుని పూలన్నీ మాల గుచ్చటం మొదలెట్టాడు. ఉండుండి కుడిపాదం నేలను తాకుతుంటే ఉయ్యాల వేగాన్ని పుంజుకుంటోంది.

పది నిమిషాలు గడిచినై.

కట్టిన మాలని గబగబా తెంచి, పూలన్నీ విరజిమ్మేశాడు. కట్టకుండా ఉన్న పూలని ఒక్కటొక్కటే తీసి ఫోటోమీద రాశిగా పేర్చేడు.

"నా బంగారు తల్లికి బంతి పూలంటే ఎంత ఇష్టమో" అని ఫోటోమీదికి ఒరిగి ఉయ్యాల బల్లకేసి తల బాదుకొని రోదించసాగేడు.

★★★

పెద్ద కూతురు రాజ్యం పెళ్లీ పేరంటాలు ఘనంగా జరిపించి పంపేరు సాంబయ్య, కాంతం. అల్లుడు హైదరాబాదులో గవర్నమెంట్ ఆఫీసరు. రెండుచేతులా సంపాదించడం అంటే ఏమిటో ఆయన ఇల్లు చూస్తే తెలుస్తుంది. బట్టలు ఉతికే మిషన్ నుంచి... బూజు దులుపుకునే మిషన్‌దాకా, ఆ యింట్లో అంతా విదేశీ సరుకే. మరో తాజ్‌మహాల్ లాంటి ఇల్లు కట్టి, అత్తమామల చేత ప్రయోజకుడనీ అనిపించుకున్నాడు, అల్లుడు.

కంప్యూటర్‌మీద పసుపూ కుంకుమా పెట్టి పూజ చేసినట్లు కాసుల పేర్లతో, కంటే, ఒడ్డాణాలతో ఆయింట్లో తిరిగే రాజ్యంను చూసే వాళ్లంతా "అదృష్టవంతురాలు" అనుకుంటూ ఉంటారు. తనకు తానుగా "నా అదృష్టం మండినట్లే ఉంది" అని మొహం పక్కకి తిప్పుకుంటుంది రాజ్యం. ఆ వెంటనే పట్టుచీర చెంగుతో కళ్లొత్తుకుంటూ వుంటుంది.

ఇరవై మూడేళ్ల కాపరంలో పదకొండుసార్లు 'చేదుమాత్ర'లే మింగింది రాజ్యం నలుగురు పిల్లలు భూమ్మీదపడి గర్భశోకం పెడితే... మిగిలినవి గర్భస్రావాలుగానే జరిగిపోయినై.

పదకొండుసార్లూ సాంబయ్యా, కాంతమ్మా కూతురి దుఃఖానికి ప్రత్యక్ష సాక్షులుగా మారిపోయారు.

అయినా, జీవితం పట్ల వాళ్ల దృష్టిలో మార్పేమీ రాలేదు; ఈ సంభవాలు వాళ్ల మనసుల మీద తీవ్రమైన ప్రభావాన్నీ కలుగజేయలేదు.

★★★

ఉయ్యాల బల్ల మీది నుంచి దిగి వంటింట్లోకి నడిచేడు, సాంబయ్య.

నిన్న ఉదయం వండుకున్న అన్నపుగిన్నె కుంపట్లో వుంది. పక్కన పీటా,

వెండి కంచం, రాగిచెంబులో నీళ్ళు. ఆ పక్కగా మజ్జిగ గిన్నె; పచ్చళ్ల రాచిప్పలూ వున్నై.

పీటమీద కూర్చున్నాడు. అన్నంతీసి కంచంలో పెట్టుకుని ముద్దలు చేయసాగేడు. క్షణాల తర్వాత కంచాన్ని చేత్తో పట్టుకుని లేచి నిలబడ్డాడు. గబగబా అడుగులు వేసుకుంటూ ఉయ్యాల బల్ల దగ్గరకి వచ్చాడు. దానిమీద నాలుగు మూలల్లోనూ, మధ్యలోనూ అన్నం ముద్దలు వుంచి పెద్దగా వికటంగా నవ్వసాగేడు.

★★★

సుమతిని మురిపెంగా పెంచి, పెద్దచేసి, బియ్యేదాకా చదివించుకున్నారు కాంతం, సాంబయ్య.

సాగర్‌నీళ్లు ఫలసాయాన్నీ, పొలాల రేటునీ కూడా పెంచుకుపోవడంతో అప్పటికి వాళ్ల సిరిసంపదలు పది పదకొండు లకారాలు దాటినై.

మంచి సంబంధాలకోసం చూసి చూసి చివరికి పాతికేళ్ళు నిండిన తర్వాత సుమతికి పెళ్లి సంబంధం ఖాయం చేశారు. కట్న కానుకలూ పెళ్లి ఖర్చూ కలిసి అరవై వేల పై చిలుకే అయింది.

కూతురి గారామూ, మురిపెమూ... అల్లుడు... పంచముఖేశ్వర్రావుకీ పంచి, చెయ్యి విదిల్చడం నేర్చుకున్నారు దంపతులు. అల్లుడు బొంబాయిలోని వో కంపెనీలో కెమిస్టు.

కాపరానికి వెళ్లిన రెండు నెలలకే నెల తప్పింది సుమతికి. వెంటవెంటనే అచ్చట్లూ ముచ్చట్లూ జరిగిపోయినై. ఏడో నెలలోనే పురిటికోసం పుట్టింటికి వచ్చింది సుమతి. అరచేతిలో నిమ్మపండుగా చూసుకుంటూ, డాక్టర్ల మందులూ, పళ్లూ, ఫలాలూ గుప్పించారు సుమతికి.

నెలలు నిండాయి. పురిటికి నర్సింగ్‌హోమ్‌లో చేరింది సుమతి.

★★★

తలుపు తెరుచుకొని బయటికొచ్చాడు సాంబయ్య.

పక్కింట్లో రుక్మిణమ్మ కూతురు గొబ్బెమ్మలు చేస్తోంది. రుక్మిణమ్మ ముంగిట్లో కల్లాపిజల్లి రంగవల్లులు తీరుస్తోంది. వీధి చివరగా సాతాని జియ్యరు హరిభజన చేస్తూ వస్తున్నాడు. వీధిలోని మిగిలిన ఇళ్లలోనూ ఆడవాళ్లు లేచి పనిపాటల్లో పడుతున్నారు.

గడపదాటి రుక్మిణమ్మ ఇంటి అరుగువరకూ అడుగులేశాడు సాంబయ్య. తయారైన ముగ్గుల్నీ, తయారౌతున్న గొబ్బెమ్మల్నీ మార్చి మార్చి చూస్తూ వుండిపోయాడు.

క్షణాల తర్వాత గొబ్బెమ్మల్ని ముగ్గుమీద పెట్టి పూలూ, పసుపూ, కుంకుమా చల్లి లోపలికి వెళ్ళిపోయింది రుక్మిణమ్మ కూతురు.

పదినిమిషాలు కాలుగాలిన పిల్లిలా అటూ ఇటూ తిరిగేడు సాంబయ్య. ఆ తర్వాత దొంగచూపులు చూస్తూ రుక్మిణమ్మ ముంగిటిదా నడిచి గొబ్బెమ్మల్ని చెల్లా చెదురు చేసేసి, రెండంగల్లో వచ్చి, తన ఇంటి మెట్టు మీద కూలబడ్డాడు.

మొహాన్ని చేతుల్లోకి తీసుకుని వెక్కి వెక్కి ఏడ్వసాగేడు.

***

రెండురోజులు నరకయాతన పడినా ప్రసవం కాలేదు సుమతికి. డాక్టర్ దంపతులు... 'చంద్రవదన', 'ముఖ్యప్రాణమూర్తి'.... 'సిజేరియన్' చేసి మగబిడ్డని తీశారు.

కాంతం, సాంబయ్య... ఆనందంతో పసిపిల్లల్లా కేరింతలు కొట్టారు; తల్లిదండ్రులుగా మురిసిపోయారు; తాతా అమ్మమ్మలుగా గర్వం పొందారు.

పదిహేను రోజులైనా తేరుకోలేదు సుమతి. ఒకటి తర్వాత ఒకటిగా అనేక బాధలు : వైద్య సమస్యలు వచ్చిపడినై. సీరియస్ అంటే అల్లుడొచ్చాడు.

సుమతిని హైదరాబాద్ తరలించారు. వెయ్యి దేవుళ్లకి మొక్కుకుని కారెక్కారు సాంబయ్య, కాంతం. సమయం మించిపోయిందన్నారు... పెద్ద డాక్టర్లు. ఆపరేషన్ సరిగ్గా చెయ్యలేదు.... అదే కారణం అన్నారు.

సుమతి చనిపోయింది.

సాంబయ్యా, కాంతం కొయ్యబారిపోయారు.

అంతా అయిపోయింది. డాక్టర్ దంపతుల్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టేరు.

తన పెళ్ళాన్ని నిలువునా పొట్టన పెట్టుకున్నారని డాక్టర్లనీ, అత్తమామల్నీ తిట్టి తిట్టి, తల గోడకేసి బాదుకున్నాడు.... అల్లుడు. సుమతి లేకుండా తాను బ్రతకలేనన్నాడు. ఆమె శవదహనం సమయంలో తానూ చితిలో దూకుతానని గుండె పిండుకుని రోదించాడు. ఊరూ వాడా అతని ప్రేమకు ముక్కున వేలేసుకున్నారు.

కాంతంని ఆమె అన్నయ్య వచ్చి వాళ్ల ఊరు తీసుకువెళ్ళాడు. ఇరవై ఏళ్ళ తర్వాత భర్తని వొంటరిగా వదిలి పుట్టింటికి వెళ్ళింది కాంతం.

రెణ్ణెల్లు గడిచినై.

* * *

కరకరలాడుతూ వచ్చాడు సూర్యుడు.

మండుతున్న జ్వాలల్లోంచీ వస్తున్నట్టు నడిచి సాగేడు సాంబయ్య. సాలెవీధి, కాపువీధి, తీర్థంవీధి దాటి చెఱువుకట్ట పక్కగా డొంకదారి పట్టేడు. ఆపైగా వాళ్ల పొలాలున్నై.

కనబడిన ప్రతివాళ్ళతోనూ ఏదో చెప్పబోతున్నాడు. అంతలోనే గ్రుడ్ల నీరు గుడ్ల కుక్కుకుంటున్నాడు. జుట్టు పీక్కుంటూ, గడ్డం నిమురుకుంటూ, మధ్య మధ్యలో క్రిందికి వంగి, నేలమీది గులకరాళ్లను పోగుచేసుకుంటూ అడుగులు వేస్తున్నాడు.

మామిడి తోపులో కొచ్చి చెట్టుకింద కూలబడ్డాడు. గడ్డిపోచల్ని పీకి మునిపంటితో కొరకసాగేడు ఉన్నట్టుండి పక్కనున్న తడిమట్టిని చేత్తో తీసుకొని మొహాన్న కొట్టుకుని పెద్దగా వికటంగా, వికృతంగా గావుకేక పెట్టేడు.

పాలు తీయబోయిన కాంతంని గేదె తన్నింది. మైకం కమ్మినట్లయింది, ఆమెకు. ఎక్కడో మనోనేత్రం మూసుకుపోయినట్టయింది. వెన్నెముక విరిగి పోయినట్లయింది. నాడీమండలం నలిగినట్లయింది.

వారం తిరిగి ఆదివారం వచ్చింది.

పంచముఖేశ్వర్రావు పెళ్లి పీటలమీద కూర్చున్నాడు...రెండోసారి. అప్పుడు... ఆశచావని కాంతం సాంబయ్యని విశాఖపట్నం తీసుకు వెళ్తోంది.

పంచముఖేశ్వర్రావ్, సాంబయ్య...ఇద్దరూ మొగవాళ్లే...

ఒకరు భర్త; ఒకరు తండ్రి !!!

....

(ఆంధ్రసచిత్ర వారపత్రిక - ఏప్రిల్ 22 1983)